

ఐసీడీఎస్ పీడీగా సూర్యలక్ష్మి

» అల్లూరి జిల్లా నుంచి బదిలీ

పాడేరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మిని అనకాపల్లి జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు మూడేళ్ల క్రితం కొత్త జిల్లాలు ఏర్పడినప్పటికీ నుంచి ఆమె పాడేరులో ఐసీడీఎస్ పీడీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా చేపట్టిన బదిలీల్లో భాగంగా ఆమె అనకాపల్లి జిల్లాకు పంపుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

అక్షరం అండగా.. ముందడుగు

సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేయాలి

» అందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రారంభించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' దోహదం
» ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య అభినందనీయులు
» తిరుమల నగర్‌లోని మిగిలిన సమస్యలు కూడా పరిష్కరిస్తా
» తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వేమూరి ఆదిత్య



'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని తిరుమలనగర్ వాసులు 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' సదస్సులో లేవనెత్తిన సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషిచేస్తానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. తిరుమల నగర్ ఆర్య వైశ్య సామాజిక భవనంలో జనవరి 28న 'ఆంధ్రజ్యోతి' 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' సదస్సు నిర్వహించగా, ప్రజలు అనేక సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రజలు లేవనెత్తిన సమస్యల్లో ప్రధానమైనవి పరిష్కారం కావడంతో సోమవారం తిరిగి అదే భవనంలో సభ నిర్వహించడం జరిగింది. 'ఆంధ్రజ్యోతి' బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాటి సదస్సులో ప్రజలు లేవనెత్తిన ప్రధాన ... మిగతా 4వ పేజీలో

ప్రజా సమస్యలే ప్రధాన అజెండా

"పత్రికలు సాధారణంగా ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువెళ్లడం వరకే పరిమితమవుతాయి. అయితే అంతటితో సరిపెట్టకుండా, అవి పరిష్కారం అయ్యేలా చూడాలనే ఉద్దేశం, లక్ష్యంతో 'ఆంధ్రజ్యోతి' ఈ 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ప్రజల సమస్యలే ప్రధాన అజెండాగా 'ఆంధ్రజ్యోతి' ముందుకుసాగుతుంది. అందుకు సహకారం అందించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము."

- వేమూరి ఆదిత్య, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్



రాజీవ్ నగర్ నుంచి ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సు సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు. చిత్రంలో కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, స్థానికులు

ఆగని అడ్డగోలు చెల్లింపులు!

కోడూరు భూసమీకరణ పరిహారంలో అధికారులు ఇష్టారాజ్యం

» ఖాతాలు, ఆధార్ సరిగా లేవని ఎస్‌బీఐ అభ్యంతరం చెప్పినా వెనక్కుతగ్గని వైనం
» ప్రైవేటు బ్యాంకు ద్వారా నలుగురికి చెల్లింపులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి మండలం కోడూరు రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వం చేపట్టిన భూ సమీకరణకు సంబంధించి అక్రమ చెల్లింపుల పరంపర కొనసాగుతునేది. బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడం, ఆధార్ కార్డుతో మ్యాచ్ కాకపోవడం వంటి కారణాలతో నలుగురి బ్యాంకు ఖాతాల్లో డబ్బులను జమ చేయడానికి ఎస్‌బీఐ నిరాకరించారు. దీంతో రెవెన్యూ అధికారులు రూటు మార్చి, ప్రైవేటు బ్యాంకు ఖాతాల్లో జమ చేయించారు.



అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం

కోడూరు రెవెన్యూ పరిధిలోని 20వ సర్వే నంబరు 39.38 ఎకరాలకు సంబంధించి కొన్నేళ్లగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ భూమి ప్రభుత్వానిదేనని 2013లో అప్పటి అనకాపల్లి తహసీల్దారుగా పనిచేసిన మంజుల నిర్ధారించారు. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. గత వైసీపీ హయాంలో భూ సమీకరణ ముసుగులో నాటి ఒక మంత్రి ఆధ్వర్యంలో నష్టపరిహారం చెల్లించేందుకు ప్రయత్నాలు జరిగాయి. టీడీపీ నాయకులు రాష్ట్ర డీజీపీకి, భూపరిపాలన విభాగానికి ఫిర్యాదు చేసి పరిహారం చెల్లించే ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకుడు తెర వెనుక ఉండి చక్రం తిప్పడంతో బినామీ రైతులకు పరిహారం చెల్లింపుల ఫైలు కదిలింది. తొమ్మిది కుటుంబాలకు చెందిన 34 మంది రైతులు ఈ భూములను సాగు చేస్తున్నట్టు రికార్డుల్లో నమోదు చేసి పరిహారంగా ప్రభుత్వం నుంచి రూ.6.19 కోట్లు విడుదల చేయించారు. అనకాపల్లిలోని ఎస్‌బీఐ శాఖ ద్వారా చెల్లింపులు జరిపేందుకు అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయ అధికారులు గత నెల మొదటి వారంలో 34 మంది జాబితాను బ్యాంకుకు పంపారు. ఇందులో 30 మందికి చెల్లింపులు జరిపిన బ్యాంకు అధికారులు.. లాలం రమేశ్ (రూ.17.4 లక్షలు), పైలా సరోజని (రూ.34 లక్షలు), లాలం శ్రీనివాసరావు (రూ.8 లక్షలు), బొబ్బరి అప్పారావులకు (రూ.14.4) చెల్లింపులు నిలిపేశారు. బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడం, ఆధార్ కార్డులతో అనుసంధానం కాకపోవడంతో ఎస్‌బీఐ అధికారులు పరిహారం మొత్తాన్ని వీరి ఖాతాల్లో జమ చేయడానికి అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో లంకెలపాలెంలోని ఒక ప్రైవేటు బ్యాంకులో వీరికి ఖాతాలు తెరిపించి, పరిహారం సొమ్మును జమచేయించినట్టు సమాచారం. కొద్ది రోజుల కిందట వరకు సెలవులో ఉండి ఇటీవలే బాధ్యతలు చేపట్టిన రెవెన్యూ అధికారి కీలకంగా వ్యవహరించి పరిహారం చెల్లింపులు జరిపించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై అనకాపల్లి తహసీల్దారు విజయ్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. భూసమీకరణ పరిహారం చెల్లింపులు ఆర్డీఓ కార్యాలయం ద్వారా జరిగాయని, వాటితో తమకు సంబంధం లేదని చెప్పారు.

డబుల్ డెక్కర్ మెట్రో రైలు

» దాంతో పాటు నాలుగు వరుసల ఫైఓవర్లు
» డీపీఆర్ తయారీ బాధ్యత బార్సిల్ కంపెనీకి అప్పగింత
» రూ.47.17 లక్షలు కేటాయింపు - 4లో
» ఎక్కువ స్థలం అవసరమవుతుందంటున్న అధికార వర్గాలు

విద్యార్థులకు బస్‌పాసులు జారీ



» అనకాపల్లి, నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో కౌంటర్లు
» డీపీటీవో కె.పద్మావతి

అనకాపల్లి టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులకు బస్‌పాసులు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారిణి (డీపీటీవో) కె.పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో బస్ పాసుల కౌంటర్లు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పనిచేస్తాయన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో apsrtcpass.in లోకివెళ్లి వారి వివరాలు, ఫొటోను అప్‌లోడ్ చేసి అప్లికేషన్ ఫారం ప్రింట్ తీసుకోవాలన్నారు. దీనిపై విద్యా సంస్థ ప్రిన్సిపాల్ లేదా హెచ్‌ఎంచేత ధ్రువీకరణ చేయించాలని చెప్పారు. దరఖాస్తుకు ఆధార్, ఇటీవల పదో తరగతి పాసైవారు అయితే మార్కుల లిస్టు జెరాక్స్ కాపీలను జతచేయాలని సూచించారు. అనంతరం దరఖాస్తును అనకాపల్లి లేదా నర్సీపట్నంలోని ఆర్టీసీ కాంప్లెక్సుల్లో బస్‌పాసుల జారీ కౌంటర్‌లో అందజేయాలని ఆమె చెప్పారు. గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు అయితే సంబంధి పాఠశాల/ కళాశాలకు చెందిన హెచ్‌ఎం/ప్రిన్సిపాల్ సంతకంతో విద్యార్థుల జాబితాలను డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని, ఆ తరువాతే పాస్‌లు జారీ అవుతాయని ఆమె స్పష్టం చేశారు. 12 ఏళ్ల లోపు బాలురు, పదో తరగతి వరకు బాలికలకు ఉచిత బస్ పాస్ జారీ చేస్తామన్నారు. స్టూడెంట్ జనరల్ బస్ పాసులు ఏడాదికి, మూడు నెలలకు, నెలకు.. వీటిలో ఏది కావాలంటే అది పొందవచ్చని డీపీటీవో చెప్పారు.



పద్మావతి, డీపీటీవో

రైతు సంక్షేమమే ధ్యేయం

బ్యాంకు టర్నోవర్‌ను రూ.3,000 కోట్లకు పెంచేందుకు కృషి

» కార్యకలాపాల్లో రాజకీయ నేతల జోక్యం లేకుండా చూస్తా
» డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు.. బాధ్యతల స్వీకరణ



డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కోన తాతారావు. చిత్రంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, గణబాబు, కూటమి నేతలు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా డీసీసీబీ కార్యకలాపాలను నిర్వహిస్తామని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు అన్నారు. నగరంలోని మర్రిపాలెంలో గల డీసీసీబీ కార్యాలయంలో సోమవారం ఆయన పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 14 జిల్లా స్థాయి బ్యాంకులు ఉండగా, వీటిలో ప్రథమ స్థానంలో డీసీసీబీ ఉందన్నారు. భవిష్యత్తులో ఇదే ర్యాంకును కొనసాగించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం డీసీసీబీ టర్నోవర్ రూ.2,400 కోట్లు ఉందని, దీనిని రూ.3,000 కోట్లకు పెంచేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతామ న్నారు. జాతీయ బ్యాంకులతో పోటీ పడేలా డీసీసీబీ కార్యకలాపాలను కార్యకలాపాలను కొనసాగించడంతో పాటు వినియోగదారులకు మరిన్ని సేవలను అందిందచేందుకు అర్బన్ ప్రాంతంలో ఏటీఏంలను, శాఖలను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో రుణాలను అందించడంతో పాటు వారితో పొదుపు చేయించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని కోన తాతారావు తెలిపారు. అదేవిధంగా రైతుల అభ్యున్నతి కోసం తగిన చర్యలు చేపడతామన్నారు. తాను రాజకీయ నేతనే అయినప్పటికీ డీసీసీబీ కార్యకలాపాల్లో రాజకీయ జోక్యం లేకుండా చూస్తానన్నారు.

ముందుగా కోన తాతారావు ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో ప్రతిజ్ఞ చేసి రిజిస్టరులో సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విశాఖ, అనకాపల్లి ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, మేయర్ పీలా శ్రీనివాసరావు, గాజువాక, పెందుర్తి, విశాఖ ఉత్తర, ఎలమంచిలి, మాడుగుల, చోడవరం, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు, పి.విష్ణుకుమార్‌రాజు, ఎస్.విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ రాజు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజుతో పాటు వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, కూటమి నాయకులు, తదితరులు కోన తాతారావుకు అభినందనలు తెలిపారు.

ఇసుక, గ్రావెల్ దందాపై టాస్క్‌ఫోర్స్

పంచాయతీల వారీగా బృందాలు ఏర్పాటు

» ఒక్కో టీమ్‌లో వీఆర్వో, వీఆర్ఏ, మహిళా పోలీసు

చోడవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా నిరోధానికి పంచాయతీల వారీగా రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో టాస్క్‌ఫోర్సు బృందాలను ఏర్పాటు చేస్తూ తహసీల్దార్ అంబటి రామారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో గవరవరం, లక్కవరం, శేమునాపల్లి, జుత్తాడ, గజపతినగరం, ముద్దుర్తి, వెంకన్నపాలెం, గంధవరం. రాయపురాజుపేట, నరసాపురం, బెన్నవోలు గ్రామాల పరిధిలో శారదా నదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు సాగుతుండడంపై జనసేన 'చోడవరం' ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, పార్టీ నాయకులు గత నెల 27న తహసీల్దార్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అంతేకాక 48 గంటల్లో తవ్వకాలు ఆగకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగుతున్న రాయపురాజుపేట, గవరవరం, జుత్తాడ, లక్కవరం, గజపతినగరం, ముద్దుర్తి, గంధవరం పంచాయతీల్లో వీఆర్వో, వీఆర్ఏ, మహిళా పోలీసులతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా జరగకుండా నిఘా ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకోవడంలో విఫలమైతే సంబంధిత బృందంలోని ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు కలెక్టర్‌కు నివేదిస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు. కాగా ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాను నిరోధించడానికి టాస్క్‌ఫోర్సు బృందాలను ఏర్పాటు చేయడాన్ని జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు స్వాగతించారు.



శేమునాపల్లి వద్ద శారదా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు (ఫైల్ ఫొటో)

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అదుర్స్

విశాఖ విద్యార్థికి ఓబీసీ కేటగిరీలో ఫస్ట్ ర్యాంకు

» ఓపెన్ కేటగిరీలో 18, 26, 78, 116, 118, 132, 216, 278, 279, 284, 334 ర్యాంకులు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, తత్సమాన విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం గత నెల నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో నగరంలోని పలు విద్యా సంస్థల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచారు. శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ విద్యార్థి డి.జ్ఞాన రుత్విక్‌సాయి 360కి 310 మార్కులు తెచ్చుకుని ఓబీసీ కేటగిరీలో జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు సాధించాడు. నగరంలో చదువుకున్న విద్యార్థికి నాలుగేళ్ల తరువాత ఓబీసీ కేటగిరీలో ప్రథమ ర్యాంకు రావడం విశేషం. అన్ని కేటగిరీల్లో కలిపి సుమారు 500 మందికిపైగా మంచి ర్యాంకులు సాధించారు. జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో పి.హేమసాయి సూర్యకార్తీక్ 26వ ర్యాంకు (ఓబీసీలో 4), కె.రసజ్ఞాన 78వ ర్యాంకు (ఓబీసీలో 8), తాళాబత్తుల మనోహర్ 116వ ర్యాంకు (ఓబీసీలో 15), పి.టి.ఆనందచక్రవర్తి 118వ ర్యాంకు, ఎం.పూర్ణసాయి 132వ ర్యాంకు ... మిగతా 4వ పేజీలో

ముంబై ఐఐటీ సీఎస్ఈలో చేరతా

» మామిడి పూర్ణ సాయి (132వ ర్యాంకు) ధర్మవరం అగ్రహారం, ఎస్.రాయవరం మండలం



ఎస్.రాయవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన మామిడి పూర్ణసాయి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 132వ ర్యాంకు (ఓబీసీ కేటగిరీలో 18వ ర్యాంకు) సాధించాడు. ఇతను విశాఖలోని నారాయణ కళాశాలలో ఇంటర్ చదివాడు. పూర్ణసాయి తండ్రి శివ నాగేశ్వరరావు ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ముంబై ఐఐటీలో సీఎస్ఈలో సీటు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడాలన్నదే తన లక్ష్యమని పూర్ణసాయి చెప్పారు.

700 కిలోల రేషన్ బియ్యం సీజ్

ఆటోలో తరలిస్తుండగా పట్టుకొన్న గొలుగొండపేట గ్రామస్థులు

నాతవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలుగొండపేట నుంచి ఆటోలో తరలిస్తున్న 700 కిలోల రేషన్ బియ్యాన్ని గ్రామస్థులు సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. అనంతరం పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ (సీఎస్‌డీటీ) కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి 14 బస్తాల్లో ప్యాకింగ్ చేసిన రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఆటో డ్రైవర్ గోపీని విచారించగా, కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడికి చెందిన అయినవిల్లి రాజు అనే వ్యక్తి కిరాయికి రమ్మంటే ఆటో తీసుకువచ్చినట్టు చెప్పాడు. రేషన్ కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తున్నట్టు నిర్ధారించామని సీఎస్ డీటీ చెప్పారు.



ఆటోలో తరలిస్తుండగా గొలుగొండపేట గ్రామస్థులు పట్టుకున్న రేషన్ బియ్యం

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఏవోకు పసిడి పతకం


బంగారు పతకంతో రాము

అచ్యుతాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న రాము రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులో సోమవారం జరిగిన 12వ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 120 కేజీల బెంచ్ ప్రెస్ విభాగంలో రాము పాల్గొని సత్తా చాటారు.

4న మండల సర్వసభ్య సమావేశం

రాంబిల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 4న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జయమాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఎంపీపీ జి.శిరీషా అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఫిలడెల్ఫియా చర్చిలో ఘనంగా వీబీఎస్

అచ్యుతాపురం రూరల్, జూన్ 2, (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచి మంచి అలవాట్లు, పద్ధతులు నేర్చుకోవడం ద్వారా రేపటి మంచి సమాజాన్ని చూడగలుగుతామని ఫిలడెల్ఫియా చర్చి వ్యవస్థాపక అధ్యక్షురాలు సుజాత అన్నారు. మండల కేంద్రం సమీపంలో మోసయ్యపేట ఫిలడెల్ఫియా చర్చిలో వెకేషన్ బైబిల్ స్కూల్(వీబీఎస్) కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటిరోజున హైదరాబాదు నుంచి విచ్చేసిన సండే స్కూల్ బోధకురాలు సౌజన్యా రాయ్ చిన్నపిల్లలకు ప్రాథమికంగా నేర్పాల్సిన మంచి అలవాట్లు, ఆధ్యాత్మిక చింతనపై వివరించారు. కార్యక్రమంలో వీబీఎస్ అధ్యాపకులు సుగంధి, ఒలీవా రాణి, అపర్ణ, అక్ష, సుప్రియ, సునీత, రాణి, జాన్, స్టీఫెన్, కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలమంచిలి మండల సమావేశం

ఎలమంచిలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ కేఎస్. కొండలరావు తెలిపారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమాశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు పెదపల్లి వేమాంబిక అమ్మవారి జాతర

ఎలమంచిలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పెదపల్లి వేమాంబిక అమ్మవారి జాతర మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లలపాలెం గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకోవాలని కోరారు. సోమవారం గ్రామంలో 108 ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు.

పనిచేయని సర్వర్

» డిపోల వద్ద లబ్ధిదారుల నిరీక్షణ


చౌక డిపో వద్ద సరకుల కోసం వేచి ఉన్న కార్డుదారులు

ఎలమంచిలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రేషను డిపోల వద్దనే సరకులు పంపిణీలో భాగంగా రెండో రోజు సోమవారం పట్టణంలోని కొన్ని డిపోల వద్ద సర్వర్ మండకొడిగా పనిచేసింది. దీంతో డిపోల వద్ద కార్డుదారులు అధిక సమయం వేచి ఉన్నారు. సర్వరు స్లోగా ఉండడంతో సమయం పడుతుందని డీలర్లు అంటున్నారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకూ సర్వర్ వేగంగా పనిచేసిందని, ఆ సమయంలో కొందరు డీలర్లు సరుకులు పంపిణీ చేశారు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట : సుందరపు

మునగపాక, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం మునగపాకలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో రోగులకు మొబైల్ వైద్య సేవలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా మొబైల్ హెల్త్ కేర్ యూనిట్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దాడి ముసిలినాయుడు, దొడ్డి శ్రీనివాసరావు, ఏవీ.సత్యనారాయణ, ఆడారి శ్రీకాంత్, ఆడారి గణేశ్, మొల్లేటి ఆనంద్, పి.మురళీకృష్ణ, మళ్ల వరహా నర్సింగరావు, మళ్ల కాశీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి యోగా పోటీలు ప్రారంభం

నక్కపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల స్థాయి యోగా పోటీలను తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో డీ సీతారామరాజు, ఆయుష్ వైద్యాధికారి కె.రఘు ప్రారంభించారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి అలయం వద్ద జరిగిన కార్యక్రమంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూకేంద్రంలోనూ,రాష్ట్రంలోనూ వున్న ఎన్డీఏ ప్రభుత్వాలు యోగాకు అధిక ప్రాచుర్యం కల్పించడం చాలా గొప్ప విషయమన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, సీనియర్ నాయకులు కురందాసు నూకరాజు, వెలగా శ్రీను, గోసల చినతాతారావు,నరిశే దిలీప్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డీ కొండలరావు, సచివాలయ ఉద్యోగి రాకేశ్, యోగా గురువులు రాంబాబు, సాయి, అధికారులు పాల్గొన్నారు.

'హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి'


సమరసత సేవా ఫౌండేషన్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

రాంబిల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలోను ఈనెల 9న హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ఎలమంచిలి సబ్ డివిజన్ కార్యదర్శి కొల్లి అప్పారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 21వ తేదీన యోగా దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. ప్రతి నెల దేవాలయం కేంద్రంగా జరగవలసిన కార్యక్రమాలు, పౌర్ణమిరోజు సామూహిక హారతి, వారం,వారం ఆలయాల్లో భజనలు, ఏకాదశి రోజున నగర సంకీర్తనలు విధిగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్‌లు చింతకాయల గగన్‌కుమార్, కారే రాముడు, గణేష్, చక్రి, సుమంత్, వెంకన్న, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో సరుగుడు తోటకు నష్టం

మునగపాక, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో గంటవానిపాలెం గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సరుగుడు తోటకు నష్టం జరిగిందని బాధిత రైతు లక్కరాజు నాగరాజు తెలిపారు. ఈ ప్రమాదం విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా జరిగిందన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలన్నారు.

నిప్పుల కొలిమిగా పాయకరావుపేట

» నిర్మానుష్యమైన రోడ్లు, జంక్షన్లు


జన సంచారం లేక వెలవెలబోయిన పాయకరావుపేటలోని గౌతమ్ సెంటర్

పాయకరావుపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో రెండ్రోజులుగా భానుడు ప్రతాపం చూపడంతో పట్టణం నిప్పుల కొలిమిగా మారింది. సోమవారం ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపడంతో అధిక ఉష్ణోగ్రతలకు బయట వడగాడ్పులు, ఇంట్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. ఈ వడగాడ్పులకు భయపడిన ప్రజలు ముఖానికి గుడ్డతో మూసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి నిప్పుల కొలిమిలా మారడంతో రోడ్డుపై వాహనాలు తప్పితే నడిచేందుకు ఎవరూ సాహసించకపోవడంతో ఎప్పుడూ రద్దీగా ఉండే గౌతమ్, సూర్యమహల్ సెంటర్లు నిర్మానుష్యంగా మారాయి. సోమవారం ఇంటర్ తరగతులు ప్రారంభమైనా ఎండకు భయపడి అధిక సంఖ్యలో విద్యార్థులు రాకపోవడంతో పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు వెలవెలబోయాయి.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

» వాణిజ్య పంటల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

పాయకరావుపేట రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సస్యరక్షణ, సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని రాజమండ్రి వాణిజ్య పంటల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని అరట్లకోట, గుంటపల్లి గ్రామాలలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కొబ్బరి వంటి దీర్ఘకాలిక వాణిజ్య తోటలలో విత్తన ఎంపిక చాలా ముఖ్యమన్నారు. పొట్టి రకాలను ఎంపిక చేసుకుంటే కాయలను దింపుకోవడం సులభంగా ఉంటుందన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బండి నాగేంద్రప్రసాద్, ఎం.శివ మాట్లాడుతూ కొబ్బరిలో తట్టకాయల నియంత్రణ, కొమ్ముపురుగు, ఎర్రముక్కు పురుగు, బంక తెగులు, తెల్లదోమల నివారణ చర్యలను వివరించారు. వరి పంటకు ముందుగా పచ్చిరొట్ట సాగు చేసి నేలలో కలియ దున్నడం ద్వారా నేల సారవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో పి.ఆదినారాయణ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది రమ్య, వందన, శ్రవణ్, సురేంద్ర, టీడీపీ నాయకులు తూము వెంకటరమణ, కట్టా శ్రీను, తుమ్మల గణేశ్, పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి సుపరిపాలనపై వేడుక రేపు : ఎమ్మెల్యే సుందరపు

» దీపావళి-సంక్రాంతిలా పండుగ జరుపుకోవాలి

» ఏడాది క్రితం ప్రజలు అరాచక పాలన అంతమొందించారు..


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో అరాచక పాలన సాగించిన వైసీపీ మూకలను ప్రజలు తరిమేసి ఏడాది అయ్యిందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన పీడ విరగడైందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై సాగించిన సుపరిపాలనకు వసంతం పూర్తయిందన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు బ్రహ్మాండమైన పాలన అందిస్తున్నారన్నారు. చెడుపై మంచి విజయం సాధించిన సమయంలో జరిపించుకునేలా 4వ తేదీన ప్రజలంతా సంక్రాంతి-దీపావళిని కలబోసిన విధంగా పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఇళ్ల ముందు రంగవల్లులు, మామిడి తోరణాలతో అలంకరించుకుని పండుగను జరుపుకోవాలన్నారు. మహిళలకు పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

9న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

రాంబిల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరులోని ధనదిబ్బ వద్ద ఈనెల 9న నిర్వహించ నున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన కొత్తూరు గ్రామస్థులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోజున 2 వేల మందితో యోగా కార్యక్రమం జరగనుందన్నారు. యోగా సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రామాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు పార్టీలకతీతంగా పేదలకు ప్రభుత్వ సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రజలకు డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వి.దిన్‌బాబు, జనసేన మండల శాఖ అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, కొత్తూరు, మామిడివాడ పంచాయతీల సర్పంచులు నానేపల్లి సాయివరప్రసాద్, ఎం. అప్పలనర్స, జనసేన నేతలు సన్యాసిరావు, బి. భాను పాల్గొన్నారు.

మార్టూరు రోడ్డులో భారీ వాహనాల నిలుపుదల

» రాకపోకలు జరగకుండా పోలీసులు చర్యలు

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


అచ్యుతాపురం అయ్యప్ప స్వామి ఆలయం వద్ద రోడ్డుకు అడ్డంగా ఏర్పాటుచేసిన ఐరన్ రాడ్లు

అచ్యుతాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మార్టూరు రోడ్డులో భారీ వాహనాల రాకపోకల నియంత్రణకు పోలీసులు చర్యలు చేపట్టారు. దీంతో సోమవారం ఉదయం నుంచి ఈ రోడ్డులో కేవలం తేలికపాటి వాహనాలు మాత్రమే రాకపోకలు కొనసాగుతున్నాయి. అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున పూడిమడకతోపాటు సెజ్ కర్మాగారాల నుంచి వచ్చే బస్సులు, భారీ వాహనాల ట్రాఫిక్‌ని సెజ్ ముఖద్వారం నుంచి యూనీపార్క్, మైలురాయి వంతెన, సెజ్ పునరావాస కాలనీ, వెంకటాపురం జంక్షన్ మీదుగా మళ్లించారు. అయితే దూరం ఎక్కువగా ఉందన్న నెపంతో డ్రైవర్లు సెజ్ పునరావాస కాలనీ ముందున్న నూకాలమ్మ ఆలయం నుంచి మార్టూరు, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ మీదుగా గల ఇరుకు రోడ్డు గుండా రాకపోకలు చేస్తున్నారు. దీంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. 'మార్టూరు రోడ్డులో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో పోలీసులు స్పందించారు. ఆదివారం అయ్యప్పస్వామి ఆలయంతోపాటు సెజ్ పునరావాస కాలనీ వద్ద గల నూకాలమ్మ ఆలయం వద్ద స్టాపర్‌లను ఏర్పాటు చేశారు. అయినా వాహనాలు ఏదో విధంగా మార్టూరు రోడ్డు గుండా రావడం ప్రారంభించాయి. దీనిని గమనించిన పోలీసులు భారీ వాహనాలు ఈరోడ్డు గుండా ప్రయాణించకుండా సోమవారం ఇనుప రాడ్లను ఏర్పాటు చేశారు.

రొయ్యల పరిశ్రమ ఎదుట గ్రామస్థుల నిరసన


రొయ్యల పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

ఎస్.రాయవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతోపాటు వ్యర్థ జలాలు పంటల కాలువలు, చెరువుల్లోకి విడుదల చేస్తున్న సాయి మెరైన్ రొయ్యల పరిశ్రమ ఎదుట సోమవారం గ్రామ సర్పంచ్ ధూళి శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎం. అప్పలరాజు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యాజమాన్యం ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. పరిశ్రమకు చెందిన వ్యర్థ జలాలతో పంట భూములు దెబ్బతింటున్నాయని, వాటి నుంచి వెలువడుతున్న దుర్వాసనతో స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని మండిపడ్డారు. దీంతో ఆందోళనకారుల వద్దకు కంపెనీ జనరల్ మేనేజర్ రఘు వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరువాత ఆందోళన కంపెనీ ఎండీ అందుబాటులో లేరని, ఈనెల 9వ తేదీ వరకు తమకు సమయం ఇవ్వాలని రఘు ఆందోళనకారులను కోరారు. అందుకు ఆందోళనకారులు అంగీకరించి, ఆందోళన విరమించారు.

అన్ని వర్గాల అభ్యున్నతే సీఎం లక్ష్యం

» తెలుగు యువత మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు


ధర్మవరం అగ్రహారంలో ఇంటికి వెళ్లి వృద్ధురాలి రేషన్ అందజేస్తున్న టీడీపీ నేతలు

ఎస్.రాయవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారని తెలుగు యువత మండల అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ధర్మవరం అగ్రహారంలో రేషన్ డిపోలకు రాలేని దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో 70 మంది వృద్ధులు, దివ్యాంగులకు ప్రతీ నెల తానే స్వయంగా రేషన్‌ను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం, టీడీపీ నాయకులు బండి నాగేశ్వరరావు, నగిరెడ్డి అప్పారావు, పాల సంఘం అధ్యక్షుడు నాయుడు, కాలువ సంఘం ఛైర్మన్ కర్రి భాను, నాయకులు వెంకటరావు, కలిగట్ల రాజా, శ్రీపాదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అట్టహాసంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ


లైనుకొత్తూరు అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

ఎలమంచిలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లైనుకొత్తూరు గ్రామంలో భారీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం 8.50 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో జరిపారు. స్వామి వారిని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, సర్పంచ్ కొల్లి రజిని, మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు, కమిటీ ప్రతినిధులు దర్శించుకున్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధుల్లో కేరళ సంప్రదాయ నృత్యాలతో ఊరేగించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ


సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరంలో అనారోగ్యానికి గురైన పోసిన సూరిబాబుకు సీఎం సహాయ నిధి మంజూరైన రూ.49,252 చెక్కును టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, నాయకుడు పెదిరెడ్డి చిట్టిబాబు సోమవారం అందజేశారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సిఫార్సు మేరకు ఈ మొత్తం మంజూరైంది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, యాళ్ల వరహాలు, మంగవరం కాలువ ఛైర్మన్ గూటూరు రామగోవిందు, నాయకులు గొర్లె రాజుబాబు, చింతకాయల రాంబాబు, బొంది కాశీవిశ్వనాథ్, దేవవరపు గోవిందు, కోనే కొండబాబు, దేవవరపు ఆనంద్, వేములపూడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జన సైనికుని కుటుంబానికి రూ.5 లక్షల బీమా నగదు

» మారుతి తల్లికి అందజేసిన ఎమ్మెల్సీ నాగబాబు


మారుతి తల్లికి రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

మునగపాక, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాటిపల్లి గ్రామానికి చెందిన కొయిలాడ మారుతి కుటుంబానికి జనసేన పార్టీ బీమా నగదును అందజేసిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పాటిపల్లి గ్రామానికి చెందిన కొయిలాడ మారుతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. మృతుడు మారుతి తల్లికి సోమవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు చెక్కును అందజేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాళ్ల చంద్రమోహన్, పి.మూర్తి, డి.రామచంద్రరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'శ్రీప్రకాశ్' విద్యార్థి ప్రతిభ


దేవి డేవిడ్ జాన్సన్

పాయకరావుపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థి దేవి డేవిడ్ జాన్సన్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆల్ ఇండియా 1,353వ ర్యాంకు సాధించాడు. సోమవారం విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్‌ప్రకాష్ విలేకర్లతో మాట్లాడుతూ.. జేఈఈ అడ్వాన్స్‌డ్ కోసం తాము ఇస్తున్న స్పెషల్ కోచింగ్ ద్వారా తమ విద్యార్థి దేవి డేవిడ్ జాన్సన్ అత్యుత్తమ ర్యాంక్ సాధించాడని తెలిపారు. కాగా ప్రతిభ కనబర్చిన విద్యార్థికి విద్యా సంస్థల అధినేత సీహెచ్ వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, పలువురు అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

'ఉపాధి కార్మికుల బకాయిలను చెల్లించాలి'


ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కార్మికుల ఎనిమిది వారాల బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మల్లవరం, ఎంజేపురంలలో ఉపాధి హామీ కార్మికులు నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ అర్థాకలితో ఎండల్లో పనిచేస్తున్న కార్మికులను ఎనిమిది వారాల నుంచి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వేసవి సమయంలో 30 శాతం వేతనం అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

పూడిమడకలో చెత్త తరలింపు

అచ్యుతాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పూడిమడకలో భారీగా పేరుకుపోయిన చెత్తను వాహనాలతో తరలిస్తున్నామని సర్పంచ్ చేపల సుహాసిని తెలిపారు. సోమవారం నుంచి ఎక్స్‌కవేటర్‌తో నాలుగు ట్రాక్టర్ల సహాయంతో చెత్తను తరలిస్తున్నామన్నారు.

నూకరాజును పరామర్శించిన టీడీపీ నేతలు

పాయకరావుపేట రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరంలో ఇటీవల అనారోగ్యానికి గురైన టీడీపీ నాయకుడు అక్కిరెడ్డి నూకరాజును సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, తదితరులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకుడు మాసాహెబ్‌పేట కాలువ మాజీ ఛైర్మన్ బోయిడి పుత్రయ్య తల్లి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగు చిన్నా, పెదిరెడ్డి శ్రీరాములు, వడ్డాది వాసు, శిధిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎస్పీ బాలు పాటల పోటీలు రేపు

ఎలమంచిలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 4వ తేదీన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా నిర్వహించే రాష్ట్ర స్థాయి పాటల పోటీలను విజయవంతం చేయాలని కార్యనిర్వాహక ఉత్సవ కమిటీ ఛైర్మన్ మత్సుర్తి రామారావు కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గాన గంధర్వుడు, పద్మవిభూషణ్ ఎస్పీ.బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. స్త్రీ, పురుషులకు రెండు విభాగాల్లో పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. పట్టణంలోని గురవప్ప కల్యాణ మండపంలో ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. వివరాలకు 8184803083- 9866307171 నంబర్లలో సంప్రదించాలని రామారావు కోరారు. ఈ సమావేశంలో కమిటీ ప్రతినిధులు ఇవటూరి సాంబశివరావు, ఆడారి అప్పారావు, కిర్లంపల్లి మహేష్, మల్లేశ్వరావు, మత్సుర్తి సాయికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కైలాస ఈశ్వరస్వామి వార్షికోత్సవం

రాంబిల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టుబోలులో సోమవారం కైలాస ఈశ్వరస్వామి నాల్గో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం కాత్యాయని కన్యాసాస్వర స్వామిల కల్యాణాన్ని వైభోగంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధనను నిర్వహించారు. కమిటీ సభ్యులు ఘట్టం ఈశ్వరరావు, ఎలమంచిలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌కు అమాయక గిరిజనులు బలి

- మావోయిస్టులతో శాంతి చర్చలకు ప్రభుత్వం ముందుకు రావాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి


సదస్సులో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

కొత్తూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమాయక ఆది వాసీ గిరిజనులను బలితీసుకుంటుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి ధ్వజమెత్తారు. అనకాపల్లిలోని రోటరీ సమావేశ మం దిరంలో 'ఆపరేషన్ కగార్ లోగుట్టు' అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోని ఆదివాసీ ప్రాంతాల్లో తీవ్రమైన యుద్ధ వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టు ఏరువేత పేరుతో నడుస్తున్న ఈ ఆపరేషన్ వెనుక అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉందన్నారు. 2005లో సల్వా జుడం, 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ చేపట్టారని, దానికి కొనసాగింపుగానే ఇప్పుడు ఆపరేషన్ కగార్ చేపడుతున్నారన్నారు. ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించిన దండకారణ్యంలో వజ్రాలు, ఇనుము, సున్నపురాయి, బాక్సైట్, డోలమైట్ సహా 29 రకాల విలువైన ఖనిజాలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి, అక్కడ అడ్డుగా ఉన్న ప్రజలను తొలగించుకోవడానికి మావోయిస్టుల అంతం పేరుతో ఆపరేషన్ కగార్ చేపట్టినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ముందుకు వచ్చి మావోయిస్టులతో శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రతినిధి వీఎస్ కృష్ణ, ఏపీ ఆదివాసీ సంఘం గౌరవాధ్యక్షుడు పీఎస్ అజయ్‌కుమార్ మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, రాష్ట్ర కార్మిక సంఘం సభ్యులు రాజబాబు, సన్యాసిరావు, సీపీఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, గురుబాబు, కోరిబిల్లి శంకరరావు, త్రినాథ్, సత్తిబాబు, విత్తనాల పోతురాజు, భద్రం, దేముడుబాబు, మాధవరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం


కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్వో సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : అర్జీల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మిలతో కలిసి అర్జీలను స్వీకరించారు. పలువురితో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ వేదిక దృష్టికి సమస్యలు తీసుకు వస్తే పరిష్కారమవుతాయని ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, ఈ తరుణంలో వారిలో ఆ నమ్మకాన్ని మరింత బలపరిచేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే లక్ష్యం కావాలన్నారు. పరిష్కారం కాని సమస్యల వివరాలను ఆయా అర్జీదారులకు వివరించడంతో పాటు పరిష్కారానికి అవకాశం ఉంటే ఆయా మార్గాలపై తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 265 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ముప్పై మంది విచ్చేసి వారి సమస్యలపై అర్జీలను సమర్పించారు. ప్రతి ఒక్కరితో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సమస్యల పరిష్కారానికి ఆయా స్టేషన్లలో ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అర్జీల్లో అధికంగా ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటిపై ఎక్కువగా ఉన్నట్టు కార్యాలయ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు (క్రైమ్) ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత : కలెక్టర్


టీబీ ముక్త్ అభియాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

అనకాపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి రహిత జిల్లాగా అనకాపల్లిని మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్- టీబీ ముక్త్ భారత్ అభియాన్-2025 పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఎవరైనా టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని 'నిక్షయ మిత్ర'గా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి రోగులను గుర్తించాలన్నారు. జిల్లా లెప్రసీ, క్షయ నివారణాధికారి కె.బాలాజీ, డాక్టర్ సీహెచ్.ధాత్రి ప్రియ, డాక్టర్ శ్రావణశ్రీ పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత బాబీ జన్మదిన వేడుకలు


బాబీకి శుభాకాంక్షలు చెబుతున్న పీలా గోవింద, రామ్‌కీ, శ్రీకాంత్ తదితరులు

అనకాపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అనకాపల్లి మండల అధ్యక్షుడు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబీ) జన్మదిన వేడుకలు సోమవారం తుమ్మపాలలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అర్బన్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రామ్‌కీ, టీడీపీ యువ నేత పీలా శ్రీకాంత్ హాజరై ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. పెద్దఎత్తున కూటమి నేతలు విచ్చేసి బాబీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులపై ఫిర్యాదు


హౌసింగ్ పీడీకి ఫిర్యాదు కాపీ అందిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

పరవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రోటోకాల్ పాటించని పౌరసరఫరాల శాఖ అధికారులతో పాటు తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేశారు. ఆది వా రం దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెంలలో చేపట్టిన రేషన్ దుకాణాల ప్రారంభోత్సవానికి పౌరసరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్ తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రోటోకాల్ పాటించని సదరు అధికారులతో పాటు ఆయా రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి సత్కారం




సత్కారం పొందిన విద్యార్థులతో అతిథులు

అనకాపల్లి టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సోమవారం ఇక్కడి పొట్టి శ్రీరాములు భవనంలో సత్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, నూకాంబిక ఆలయ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీనులు తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను సత్కరించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగమణి, శ్రీరాములు భవన నిర్వాహకులు పీఎంఎల్ నరసింహమూర్తి, ప్రోగ్రామ్ చైర్మన్లు గంగుపాం నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, నాగజ్యోతి పాల్గొన్నారు.

'నాలుగున ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళన'

అనకాపల్లి టౌన్/పరవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలిసే విధంగా ఈనెల నాల్గో తేదీన నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, నాయకులు మందపాటి జానకిరామరాజు, దంతులూరి దిలీప్‌కుమార్, మలసాల కిశోర్, గోవింద్, రాఘవ, జాజుల రమేష్, కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, నాలుగో తేదీన చేపట్టనున్న ఆందోళనలో పెందుర్తి నియోజకవర్గంలోని వైసీపీ శ్రేణులు పాల్గొనాల్సిందిగా మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. పరవాడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం : ఎంపీ సీఎం రమేశ్


కార్డుదారులకు రేషన్ అందిస్తున్న ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగానే పాలన సాగుతుందని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక గాంధీనగరంలోని రెండో నంబరు రేషన్ డిపోలో సరకుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిపోల్లో రేషన్ పంపిణీ చేయడంపై కార్డులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం సహకారంతో సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో యువత ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. వలంటీర్లు లేకపోతే పింఛన్లు ఎలా పంపిణీ చేస్తారని మాజీ సీఎం జగన్ ప్రశ్నించారని, ఏడాది నుంచి సచివాలయాల ఉద్యోగులతో ఒకటో తేదీన పింఛన్ డబ్బులు అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీయూఎఫ్ఐడీ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్, ఆర్డీవో షేక్ ఆయిషా, డీఎస్‌వో మూర్తి, సీఎస్‌డీటీ లీల, తహసీల్దార్ విజయ్‌కుమార్, తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య, స్పెషల్ ఆఫీసర్ ఎస్ఎం రాధాకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'యోగాతో మానసిక ఒత్తిడి దూరం'


యోగాసనాలు వేస్తున్న రవాణా శాఖ అధికారులు, డ్రైవర్లు


నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడిన అధికారులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజూ ప్రాణాయామం, ధ్యానం చేయడం వల్ల ప్రయాణాల్లో వచ్చే మానసిక ఒత్తిడిని తగ్గించవచ్చునని, ప్రతి ఒక్క డ్రైవర్ విధిగా యోగా సాధన చేయాలని జిల్లా రవాణా శాఖాధికారి జి.మనోహర్ సూచించారు. సోమవారం ఇక్కడి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఉదయం ఏడు గంటలకు జిల్లా రవాణాశాఖ సిబ్బంది, ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల సంఘాలతో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఎక్కువ సమయం వాహనాల్లో గడిపే కారణంగా శారీరక, మానసిక ఒత్తిడికి గురవుతారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యోగా ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. నర్సీపట్నం ప్రాంతీయ రవాణా శాఖాధికారి ఎన్.రమేష్ మాట్లాడుతూ యోగా ఆరోగ్య పరిరక్షణకు దివ్యౌషధంగా పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి అంతా సమాయత్తం కావాలన్నారు. అనంతరం యోగా గురువులు మంగియ్య, బి.అప్పారావులు అందరితో ఆసనాలు వేయించడంతో పాటు యోగా వల్ల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రకాష్‌రావు, రాజన్న, వెంకటరావు, పరిపాలనాధికారి బాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై జీవీఎంసీ అధికారులు ర్యాలీ

జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జోనల్ కార్యాలయం నుంచి చోడవరం రోడ్డు, మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ నెహ్రూచౌక్‌కు చేరుకుంది. ఇక్కడ అధికారులు, సిబ్బంది మానవహారంగా ఏర్పడి యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ ఆర్ఐ కె.రమణ, ఆర్ఐలు పరదేశినాయుడు, ఈఈ. ఎస్.శేఖర్, డీఈ గోపాలకృష్ణ, ఏపీడీ వై.సంతోష్‌కుమార్, డీపీవో పి.కనకారావు, యోగా గురువులు ఎన్ఎన్ మాణిక్యాలరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపో ఏర్పాటుకు ఐద్వా ఆందోళన


తహసీల్దార్‌కు వినతి అందిస్తున్న జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం తదితరులు

పరవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, ఆ పక్కనే గల టిడ్కో గృహ సముదాయంలో నివశించే వారి సౌకర్యార్థం రేషన్ డిపో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడి మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగ ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ డిపో ద్వారా సరకులు పంపిణీ చేస్తామని ప్రకటించినప్పటికీ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, టిడ్కో గృహ సముదాయం వద్ద రేషన్ డిపో ఏర్పాటు చేయకపోవడం వల్ల ఆయా ప్రాంతాలవారు సుమారు రెండు కిలో మీటర్ల దూరం వెళ్లి రేషన్ తెచ్చుకోవలసి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కాలనీలవాసులకు అందుబాటులో ఉండే విధంగా డిపోను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్, మండల పరిషత్ కార్యాలయ ఏవో రాంబాబులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సంఘం ప్రతినిధులు బంగారమ్మ, అన్నపూర్ణ, సంతోషి, అబద్దం, కనకమహాలక్ష్మి, రమణమ్మ, వరలక్ష్మి, మంగ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల సాగుతో సంపూర్ణ ఆరోగ్యం

కశింకోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సహజ ఎరువుల వాడకం వల్ల కలిగే ఉపయోగాలపై రైతులంతా పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రామారావు సూచించారు. మండలంలోని గరుగు భీమవరం గ్రామ సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. మట్టి స్వభావం అంచనా వేసి సహజ ఎరువులతో పంటలను పండించుకోవాలన్నారు. దీని వల్ల ప్రజలంతా ఆరోగ్యకరమైన జీవితాన్ని సాగించడమే కాకుండా రైతు లకు మంచి రాబడి వస్తుందన్నారు. రైతులకు ఎటువంటి సందేహాలున్నా రైతు సేవా కేంద్రాలను సంప్రదించాల్సిందిగా సూచించారు. ఉద్యాన విస్తరణాధికారి ప్రవీణ మాట్లాడుతూ పంటల సాగు, బిందు సేద్యంపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయాధికారిణి స్వప్న, భూసార శాస్త్రవేత్త శ్రీహరిరావు, పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజ్ఞి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రైల్వే క్రాసింగ్ కేబుల్ పునరుద్ధరణ

- పలు గ్రామాల ప్రజలకు విద్యుత్ సరఫరాలో అవస్థలకు తెర


కేబుల్ పనుల ప్రారంభోత్సవంలో అధికారులు, సిబ్బంది

కశింకోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమవరం గ్రామం వద్ద గల రైల్వే భూగర్భ కేబుల్ మూడేళ్ల క్రితం మరమ్మతుకు గురైంది. నాటి నుంచి సోమవరం, అమీన్ సాహెబ్ పేట, ఏనుగుతుని, గం టవానిపాలెం, జోగారావుపేట, బుచ్చెయ్యపేట, చిన ఏనుగుతుని గ్రామాలకు విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో జరిగేది కాదు. అప్పట్లో ఈ సమస్య అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి వెళ్లినా స్పందించేవారు కరువయ్యారు. ఇటీవల ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు స్థానిక నాయకులు ఈ సమస్య వివరించడంతో ప్రత్యేక దృష్టిసారించారు. ఆయన ఆదేశాల మేరకు తాళ్లపాలెం ఫీడర్‌ను ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్. రామకృష్ణ, అగనంపూడి డీఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించి రైల్వే క్రాసింగ్ కేబుల్‌ను సోమవారం పునరుద్ధరించారు.

స్వప్రయోజనాల కోసమే వారు పార్టీ మారారు : టీడీపీ నాయకులు


విలేకరుల సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు

సబ్బవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : స్వప్రయోజనాల కోసం పార్టీని వీడి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిపై నిందలు మోపడం సరికాదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు అన్నారు. సోమ వా రం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత శనివారం పైడివాడఅగ్రహారం, సబ్బవరం, పెదనాయుడుపాలెం గ్రామాల నుంచి టీడీపీని వీడి వెళ్లినవారు చేసిన ఆరోపణలను ఖండించారు. పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీని ఏనాడూ కలిసి వారి సమస్యలను విన్నవించ లేదన్నారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన అక్కిరెడ్డి దుర్గినాయుడు భార్య రామ లక్ష్మిని 2013లో టీడీపీ శ్రేణులు ఎంపీటీసీగా గెలిపించారని గుర్తుచేశారు. పీఆర్‌పీ నుంచి వచ్చిన శీరం అప్పలరాజును 2021లో ఎంపీటీసీగా పార్టీ గెలిపించిందన్నారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన పెదనాయుడుపాలేనికి చెం దిన కేవీ సత్యనారాయణకు రెండుసార్లు ఎంపీటీసీగా పోటీ చేసే అవ కాశం కల్పించిందన్నారు. వైసీపీ నుంచి వచ్చిన రొమాల చంద్రశేఖర్‌ను గుర్తించి గతంలో నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పదవి, ఇటీవల మేజర్ పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నిక చేసి సముచిత స్థానాన్ని పార్టీ కల్పించిందన్నారు. ఇతర పార్టీల వారిని విలేకరుల సమావేశానికి తీసుకొచ్చి ఐదొందల మంది టీడీపీని వీడినట్టు ప్రకటించడం సరికాదని పైడివాడ అగ్రహారానికి చెందిన బొబ్బరి కన్నారావు ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ దాసరి వెంకటరమణ, టీడీపీ నాయకులు దాసరి రమణ, గండి దేముడు, పోతల కనకరాజు, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, బొబ్బరి కన్నారావు, గొర్లి చైతన్య, రెడ్డి దేముడు, ఆకుల గణేశ్, కోన సోమేశ్వరరావు, అక్కుబాబు, బలిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ కార్యాలయంలో వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేయించుకుంటున్న జడ్పీ రమణ

అనకాపల్లి టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అధికారులు, సిబ్బందికి కేర్ ఆసుపత్రి, మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి, డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు బీపీ, షుగర్, కంటి, డెంటల్, చెవి, క్యాన్సర్ తదితరాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణకు పలు సూచనలు చేశారు.

చిత్రలేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పరవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా రాంకీ ఫౌండేషన్, విశాఖ ఫార్మాసిటీ సంయుక్త ఆధ్వర్యంలో తాడి, తానాం గ్రామాలకు చెందిన ఐదు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. తొలుత ఈ పోటీలను విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధరరావుభక్తి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మొత్తం 88 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్, విశాఖ ఫార్మాసిటీ సేఫ్టీ ఆఫీసర్ శ్రీనాథ్, రాంకీ ఫౌండేషన్ సిబ్బంది రాజేశ్వరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు లారీలు స్వాధీనం

కొత్తూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంల కోడూరు గ్రామ సమీపంలో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు లారీలను అదుపులోకి తీసుకున్నామని అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి లారీలను తనిఖీ చేయగా, మట్టిని తరలిస్తున్న లారీల సిబ్బంది వద్ద ఎటువంటి బిల్లులు లేవన్నారు. ఈ మేరకు మూడు లారీలను మైన్స్ అధికారులకు అప్పగించినట్టు చెప్పారు. అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రహదారిపై మురుగుతో ఇక్కట్లు


రోడ్డుపై తిష్ఠ వేసిన మురుగు

పరవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమునాయుడుపాలెం నుంచి మూలస్వయంభూవరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మురుగునీటి ప్రవాహంతో అధ్వానంగా ఉంది. మూలస్వయంభూవరంలో డ్రైనేజీలను పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో వాడుక నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీనివల్ల పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెంది రాత్రివేళ నిద్ర ఉండడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యను పంచాయతీ దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర

» డీఎఫ్‌వో పీవీ.సందీప్‌రెడ్డి, సిబ్బంది హాజరు



పాడేరులో యోగా సాధన చేస్తున్న డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, సిబ్బంది

పాడేరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర- 2025 మాసోత్సవాల్లో భాగంగా స్థానిక డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ పీవీ.సందీప్‌రెడ్డి, సిబ్బంది సోమవారం తన కార్యాలయం ఆవరణలో యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ యోగా సాధనతో ఫిట్‌నెస్ పెరుగుతుందన్నారు. డివిజన్‌లోని వివిధ అటవీ రేంజ్‌ల పరిధిలోని పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది 70 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చు

» ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ గౌరీశంకరరావు

పాడేరురూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): యోగాతో విద్యార్థులు ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి ఆదేశాల మేరకు సోమవారం కళాశాలలో విద్యార్థులకు యోగాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు యోగా సాధనకు ముందుకు రావాలన్నారు. అనంతరం విద్యార్థులకు యోగాంధ్రపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభను కనపరిచిన విద్యార్థులకు అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో జానకిరామ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సీలేరు జూనియర్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

సీలేరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 2025-2026 సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని కాలేజీ ప్రిన్సిపాల్ వి. శంకరావు తెలిపారు. కాలేజీలో హెచ్ఈసీ, సీఈసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయని, పదో తరగతి పాసైన విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడానికి దరఖాస్తులను ఇస్తున్నామన్నారు. మొదటి సంవత్సరంలో జాయిన్ అయ్యే విద్యార్థులు రూ.1,450 చెల్లించాల్సి ఉంటుందని, అర్హులైన విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగ్‌లు, తల్లికి వందనం ద్వారా విద్యార్థి తల్లి బ్యాంక్ ఖాతాలో రూ.15 వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వర్తింపు, దూర ప్రాంతాల విద్యార్థులకు వసతి సదుపాయం కలదని ప్రిన్సిపాల్ శంకరావు తెలిపారు.

ఉపాధి హామీలో ఉద్యాన పంటల సాగు

» ఏపీడీ లాలం సీతయ్య



డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను పరిశీలిస్తున్న ఏపీడీ సీతయ్య

గూడెంకొత్తవీధి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా గిరిజన రైతులతో ఉద్యాన పంటల సాగు చేపడుతున్నట్టు స్థానిక ఏపీడీ లాలం సీతయ్య అన్నారు. సోమవారం మండలంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న డ్రాగన్‌ఫ్రూట్ తోటలు, నీటి కందకాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ 2025-26 వార్షిక సంవత్సరంలో గిరిజన రైతులకు ఉద్యాన మొక్కలను పంపిణీ చేయాల్సివుందన్నారు. ఉద్యాన పంట మొక్కల సంరక్షణకు మూడేళ్ల పాటు ప్రోత్సాహాలను అందిస్తామన్నారు. అలాగే నీటి కందకాల లక్ష్యాలను ఉపాధి సిబ్బంది పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఏసీబీ వలలో సబ్ ట్రెజరీ అధికారి

» రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

» ఏసీబీని ఆశ్రయించిన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు



ఏసీబీకి చిక్కిన చింతూరు డివిజనల్ సబ్ ట్రెజరీ అధికారి వంశీ కళ్యాణ్, సీనియర్ అకౌంటెంట్ శామ్యూల్. చిత్రంలో పట్టుబడిన నగదు

చింతూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఉప ఖజానా కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సబ్ ట్రెజరి అధికారి జీడీ వంశీ కళ్యాణ్, ఇదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎన్‌వీఎంఎస్ సామ్యూల్‌లు సోమవారం ఏసీబీ వలలో చిక్కారు. ఈ మేరకు విశాఖపట్నం రేంజ్ ఏసీబీ డీఎస్పీ టీవీఎస్ నాగేశ్వరరావు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం, నరసింహాపురం (బాలురు) ఆశ్రమ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎస్.పకీర్ దొర విధులు నిర్వర్తిస్తున్నారు. పకీర్‌దొరకు సంబంధించి పది సంవత్సరాల ఇంక్రిమెంట్లు, ఏరియర్స్ బిల్లులు మొత్తం రూ.11,54,254 చెల్లింపు ఆమోదించే క్రమంలో లంచంగా రూ. 2 లక్షలు ఎస్టీఓ (సబ్ ట్రెజరీ అధికారి) డిమాండ్ చేశారన్నారు. దీంతో బాధితుడైన ఉపాధ్యాయుడు తమను ఆశ్రయించినట్టు తెలిపారు. దీంతో తాము రంగంలోకి దిగినట్టు డీఎస్పీ తెలిపారు. ఇదిలా ఉండగా ముందుగా రూ. 1 లక్ష అడ్వాన్సుగా చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా నేరుగా కార్యాలయంలోనే ఉపాధ్యాయుడు నుంచి సబ్ ట్రెజరీ అధికారి సూచన మేరకు సీనియర్ అసిస్టెంట్ రూ. 1 లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డట్లు డీఎస్పీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేయడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. దాడిలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, శ్రీనివాసరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

డుంబ్రిగుడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు సేవ కేంద్రంలో సోమవారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఏవో నీలవేణి మాట్లాడుతూ శ్రీకాకుళం సన్నాలు, ఆర్‌జీఎల్-2537, ఎంటీజీ-1121, టీయూ-1318, ఎంటీయూ-1064, ఆర్ఎన్ఆర్-15048 తదితర రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు నకళ్లతో వచ్చి ఈ విత్తనాలను రాయితీపై పొందవచ్చని చెప్పారు. అలాగే జీవన ఎరువులు 50 శాతం రాయితీపై ఇస్తున్నట్టు ఆమె తెలిపారు.

ప్రధాన మార్గం.. ప్రమాదకరం!

» ముంచంగిపుట్టు రహదారిలో భారీ గతుకులు

» తరచూ ప్రమాదాలు.. చోద్యం చూస్తున్న అధికారులు



చోటాముఖిపుట్టు సమీపంలో గతుకులు దాటే సమయంలో ఆర్టీసీ బస్సు... (ఇన్‌సెట్‌లో) ప్రమాదకరంగా ఉన్న గతుకులు

ముంచంగిపుట్టు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి ప్రమాదకరంగా పరిణమించింది. ఈ మార్గంలో ఏర్పడిన భారీ గతుకులు వాహన చోదకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇక్కడ తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలోని చోటాముఖిపుట్టు సమీపంలో వంతెన ముందు భాగం రహదారి మూడేళ్ల క్రితం కోతకు గురైంది. దాని మరమ్మతులపై అధికారులు దృష్టిసారించలేదు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ఆ ప్రదేశంలో రహదారి మరికాస్త అధ్వానంగా మారింది. ప్రస్తుతం ఆ ప్రదేశం వాహన ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారింది. రహదారిపై భారీ గొయ్యితో పాటు పలు చోట్ల గతుకులు ఏర్పడడంతో ఆ ప్రదేశంలో తరచూ ఎక్కువగా ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురౌతున్నారు.

ఆరు నెలల వ్యవధిలో సుమారు 25 ద్విచక్ర వాహనాలకు పైగా అదుపు తప్పాయి. ఆ ప్రమాదాల్లో పదుల సంఖ్యలో గాయాల పాలయ్యారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం విచారకరం. రాత్రివేళలో అటుగా ఏమాత్రం ఆదమరిచి వాహన ప్రయాణం సాగించినా పెనుప్రమాదం బారిన పడే ఆస్కారం లేకపోలేదు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో గతంలో ఆ ప్రాంతీయులు రెండు మూడు సార్లు శ్రమదానంతో రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా రహదారి పూర్వస్థితికి వచ్చేసింది. ఆ ప్రదేశంలో రహదారి ఇరువైపులా డ్రైనేజీ లేకపోవడంతో వరదనీరు రహదారిపై ఉధృతంగా ప్రవహించడంతో కోతకు గురైంది. పలు చోట్ల గుంతల్లో వరదనీరు నిల్వ ఉండిపోతున్నది. దీంతో అటుగా వాహన రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు అష్టకష్టాలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆ గుంత దాటే సమయంలో వాహనాలు కిందకు ఒరిగిపోతున్నాయి. ఆంధ్రా, ఒడిశా ప్రజలు ఈ మార్గంలో నిత్యం వాహన రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి రహదారిని అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలకు వెల్లువెత్తుతున్నాయి. పెను ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి రహదారి మరమ్మతు చేయాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

గిరిజన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

» ప్రతిభా అవార్డుల కార్యక్రమంలో ఏఎస్పీ ధీరజ్



పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభా అవార్డులు అందుకున్న విద్యార్థులతో ఏఎస్పీ ధీరజ్, డీఈవో బ్రహ్మాజీరావు తదితరులు

పాడేరురూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు విద్యారంగంలో ప్రతిభను చూపి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏఎస్పీ కె.ధీరజ్ కోరారు. గిరిజన జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కాఫీహౌస్‌లో నిర్వహించిన పది, ఇంటర్ విద్యార్థులకు అందించిన ప్రతిభా అవార్డుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు సరైన పద్ధతిలో ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తే అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని అన్నారు. డివిజన్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆయన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ జిల్లాలో నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యా శాఖ నుంచి అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులకు అవార్డులు అందించారు. కార్యక్రమంలో గిరిజన జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సింహాచలం, మోరి జాన్ సలీం, కంబిడి రాంబాబు, శెట్టి పూర్ణచంద్రుడు, మోహన్, సురేష్, వెంకటేశ్వర్లు, సూర్యప్రసాద్, నాగమణి పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ స్థలాల్లో కట్టడాలు స్వచ్ఛందంగా తొలగింపు



ఆర్అండ్‌బీ స్థలాన్ని ఖాళీ చేస్తున్న వర్తకులు

చింతపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ స్థలాల్లో కట్టడాలను వర్తకులు స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. హైకోర్టు ఉత్తర్వులతో రెండు రోజుల క్రితం ఆర్అండ్‌బీ స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించేందుకు రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు సిద్ధపడ్డారు. దీంతో ప్రజాప్రతినిధులు, వర్తకులు వారం రోజులు సమయం ఇస్తే స్వచ్ఛందంగా కట్టడాలను తొలగించుకుంటామని అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో తహసీల్దార్ టి. రామకృష్ణ గడువు ఇచ్చారు. స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య సూచన మేరకు వర్తకులు ఆర్అండ్‌బీ స్థలాల్లో కట్టడాలను తొలగిస్తున్నారు. సోమవారం హనుమాన్ జంక్షన్ నుంచి పాత బస్టాండ్ వరకు ఆర్అండ్‌బీ స్థలాల్లో కట్టడాలను వర్తకులు తొలగించే పనులు ప్రారంభించారు. మరో మూడు రోజుల్లో వర్తకులందరూ ఆర్అండ్‌బీ స్థలాలను ఖాళీ చేస్తారని స్థానిక వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు తెలిపారు.

ఆదివాసీలకు ప్రత్యామ్నాయం చూపాలి

మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల్లో గృహాలు, దుకాణాలు కోల్పోతున్న ఆదివాసీలకు అధికారులు ప్రత్యామ్నాయం చూపించాలని గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. సోమవారం దుకాణాలు, గృహాలు కోల్పోతున్న ఆదివాసీలు గిరిజన సంఘం నాయకులతో కలిసి డీటీ చంద్రశేఖరరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస ఇంటి స్థలం లేని ఆదివాసీలు ఉన్నారని, వారికి దుకాణమే జీవనాధారమన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గృహాలు, భూములు కోల్పోయిన ఆదివాసీలకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఈకార్యక్రమంలో గిరిజన వర్తక సంఘం నాయకుడు వనుపరి హంరాజు, ఆటో యూనియర్ డ్రైవర్ సంఘం నాయకులు రమణ, సాగిన రామరాజు పడాల్, వైసీపీ నాయకులు జల్లి సుధాకర్, గంగన్నపడాల్ పాల్గొన్నారు.

అధికారులు అక్రమంగా ఇంటిని కూల్చేశారు

» జాతీయ ఎస్టీ కమిషన్‌కు గిరిజన మహిళ ఫిర్యాదు



రంపచోడవరంలో అధికారులు కూల్చిన గిరిజన మహిళకు చెందిన నిర్మాణం

పాడేరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తన ఇంటిని అధికారులు అక్రమంగా కూల్చేశారని రంపచోడవరం ప్రాంతానికి చెందిన ముర్ల లక్ష్మి అనే గిరిజన మహిళ జాతీయ ఎస్టీ కమిషన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రంపచోడవరంలో రోడ్ల, భవనాల శాఖ రహదారిని ఆనుకుని ఉన్న అనేక నిర్మాణాల తొలగింపును రెవెన్యూ అధికారులు శనివారం చేపట్టారు. చట్టంలో ఎక్కడా కూడా ఆక్రమణల్లో ఉన్న నిర్మాణాలను నేలమట్టం చేసే అధికారం లేకపోయినప్పటికీ అధికారులు చట్టవిరుద్ధంగా నిర్మాణాలను యంత్రాలతో నేలమట్టం చేశారని, గిరిజన మహిళగా తనపై అట్రాసిటికి పాల్పడినట్టేనని ముర్ల లక్ష్మి రంపచోడవరం తహసీల్దార్ రామకృష్ణ, కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పనశ్రీలపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తాను రూ.10 లక్షల మేర ఆస్తిని నష్టపోయి, అట్రాసిటీకి గురయ్యానని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు లక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాడేరు చేరుకున్న గిరిజన సంఘం జీపు జాత



పాడేరుకు చేరుకున్న గిరిజన సంఘం జీపుజాతను ఉద్దేశించి మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

పాడేరురూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్న డిమాండ్‌తో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మే 31న ప్రారంభమైన జీపుజాత సోమవారం పాడేరుకి చేరుకుంది. ఈ సందర్భంగా సినిమాహాలు సెంటర్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు గిరిజన సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగాలను ఆదివాసీ నిరుద్యోగ యువతతో భర్తీ చేయాలన్నారు. జిల్లాలో రాజవొమ్మంగి, రంపచోడవరం, చింతూరులో ప్రచారం నిర్వహించి, కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద 4వ తేదీన ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అశోక్, ఎస్.ధర్మన్నపడాల్, పి.బాలదేవ్, కె.రాధాకృష్ణ, పాలికి లక్కు, ఎల్.సుందరరావు, టి.కృష్ణారావు, హైమావతి పాల్గొన్నారు.

చింతపల్లిలో..

మెగా డీఎస్సీలో ఏజెన్సీ ఉపాధ్యాయుల పోస్టులు మినహాయించాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. గిరిజన సంఘం చేపట్టిన జీపు యాత్ర సోమవారం చింతపల్లి చేరుకున్నది. పాతబస్టాండ్‌లో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ జీవో నంబరు-3 రద్దుకావడంతో ఆదివాసీ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ నుంచి గిరిజన ప్రాంత పోస్టులు మినహాయించి, గిరిజన ప్రాంత పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాంగి ధనుంజయ్, పాంగి బాలయ్య, సాగిన చిరంజీవి, మట్టి రాంబాబు, కిల్లో సింహాచలం, శేఖర్, సోమలింగం పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలను వినియోగించుకోవాలి: ఎంపీపీ



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వరహాలమ్మ, అధికారులు

పెదబయలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 90 శాతం రాయితీతో అందిస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బొండా వరహాలమ్మ సూచించారు. సోమవారం సీతగుంట రైతు సేవా కేంద్రం వద్ద జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబుతో కలసి రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది వేసవిలోనూ ఏజెన్సీ ప్రాంతంలో వర్షాలు విస్తారంగా కురియడంతో ముందుగానే నారు వేసుకునేందుకు అనువుగా వరి విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఈ ఏడాది 1678 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపగా, ప్రస్తుతం 1145 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని చెప్పారు. విత్తన మొలక శాతం కూడా సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ విత్తనాలను గంపరాయి, సీతగుంట, అడుగులపుట్టు రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల రైతులు రాయితీతో పొందవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రంగారావు, సర్పంచ్ పలాసి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా మాసోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



మలేరియా మాసోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జాతీయ మలేరియా మాసోత్సవం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. మలేరియా నియంత్రణలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను పక్కాగా చేపట్టి, జిల్లాలో మలేరియాను నియంత్రించాలని ఈసందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా మలేరియా అధికారి తులసి, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్.లోకేశ్వరరావు, క్షయ వైద్యాధికారి సూర్యనారాయణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

'పచ్చిరొట్ట విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి'



పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏవో శ్రీనివాసరావు

చింతపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం లంబసింగి రైతు సేవా కేంద్రంలో గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువులను వ్యవసాయ అధికారి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువును సాగు చేసుకుని పొలాల్లో కలియ దున్నుకోవడంతో సూక్ష్మపోషకాలు పంటలకు పుష్కలంగా అందుతాయన్నారు.కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రావుల నాగమణి, జనసేన జుబ్జిబాబు, బీజేపీ నాయకుడు సాగిన బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు పాల్గొన్నారు.

'జనుగూరులో మౌలిక సదుపాయాలు కల్పించాలి'



జనుగూరులో ఊటగెడ్డను పరిశీలిస్తున్న జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు

చింతపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుడుముసారి పంచాయతీ జనుగూరులో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు అన్నారు. సోమవారం గ్రామాన్ని సందర్శించిన ఆయన స్థానికుల సమస్యలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల జనుగూరు గ్రామానికి రహదారి, పాఠశాల భవనం, తాగు నీటి పథకం అందుబాటులో లేవన్నారు. ఆదివాసీలు నేటికి ఊటగెడ్డ నీళ్లను తాగుతున్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతానన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సాగిన బాలకృష్ణ, జనసేన, బీజేపీ నాయకులు సుబ్బారావు, గిరి, మోహన్, నాగేశ్వరరావు, సాంబ, రాజారావు, గ్రామ పెద్దలు సుబ్బు, రమేశ్ పాల్గొన్నారు.

22 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

చింతూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. చింతూరు ఎస్ఐ పి.రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన చింతల దుర్గాప్రసాద్, పిల్లి లీలాకృష్ణ ఒడిశాలోకి మల్కనగిరిలో 22 కిలోల గంజాయి కొనుగోలు చేశారు.అనంతరం చింతూరు మీదుగా ద్విచక్ర వాహనంలో గంజాయి తరలించే యత్నం చేశారు. సోమవారం జరిపిన వాహన తనిఖీలలో భాగంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు పట్టుబడినట్టు ఆయన తెలిపారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు చేయడంతో పాటు వారి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,10,000 వరకు ఉంటుందన్నారు.

నూతనోత్తేజంతో పనిచేస్తాం

» టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు



టీడీపీ మండల నూతన కార్యవర్గం సభ్యులు, నేతలు

అనంతగిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి నూతన ఉత్సాహంతో పని చేస్తామని పార్టీ మండల అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ నూతన కార్యవర్గ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు నియోజకవర్గం ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర ఆదేశాల మేరకు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శిగా మజ్జి భీమరాజు, ఉపాధ్యక్షుడిగా పి.జగన్‌బాబును నియమించామని చెప్పారు. నూతన కార్యవర్గం ఎన్నిక కావడంతో నూతన ఉత్సాహంతో పనిచేయడంతో పాటు పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాబీ, భీమన్న, శంకరరావు, మహేష్, గురువులు, లక్ష్మీ, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించరూ..

లింగేరిపుట్టు, దోమలొడ్డు గ్రామాల గిరిజనుల వినతి

పెదబయలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగేటి పంచాయితీ లింగేరిపుట్టు, బొంగరం పంచాయితీ దోమలొడ్డు గ్రామాల్లో నెల రోజులు విద్యుత్ సరఫరా లేదు. దీంతో రెండు గ్రామాల ప్రజలు అంధకారంలోనే కొట్టుమిట్టాడుతున్నారు. సోమవారం ఆయా గ్రామాల గిరిజనులతో కలసి విద్యుత్ శాఖ కార్యాలయంలోని లైన్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజును జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు కలిసి సమస్యను వివరించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయి నెల రోజులవుతున్నా పునరుద్ధరించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. లింగేరిపుట్టు గ్రామంలో డీటీఆర్ తరలించడానికి గ్రామస్థులు సొంత డబ్బులతో ప్రైవేటు వాహనాన్ని వినియోగించారన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఈ రెండు గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆయన కోరారు.

బీఎన్ రహదారి పనులపై సీఎంకు నివేదిక



జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు

చోడవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో దుర్భరంగా మారిన బీఎన్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చూడాలని సీఎంను కలిసి నివేదిక అందిస్తామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు సోమవారం తెలిపారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆగిపోయిన ఈ రహదారి పనులు ప్రారంభించి నియోజకవర్గ ప్రజల కష్టాలు తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని సీఎంను కోరుతామన్నారు. కాంట్రాక్టర్ నిర్వాకం కారణంగానే బీఎన్ రోడ్డు పరిస్థితి దయనీయంగా మారిందని. కనీసం ప్రయాణించడానికి వీల్లేని స్థితికి చేరిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కూలిన వంతెనల స్థానంలో కొత్త వంతెనల నిర్మాణం చేపట్టకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు.

'తొమ్మిది కేసుల్లో నిందితుడ్ని వెనకేసుకు వస్తారా..'

నర్సీపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది కేసుల్లో నిందితుడ్ని మాజీ ఎమ్మెల్యే గణేశ్ వెనకేసుకు రావడం విడ్డూరంగా ఉందని 24వ వార్డు టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు అన్నారు. సోమవారం స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి ప్రెస్‌నోట్ విడుదల చేశారు. రౌడీ షీటర్‌ను వెనకేసుకొని వస్తూ 4న బైక్ ర్యాలీ నిర్వహించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

బుచ్చెయ్యపేట, జూన్ 2 (ఆంధ్ర జ్యోతి): ఐతంపూడి గ్రామంలో జరిగిన రెండు వరుస చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. ఉపాధికి గ్రామం విడిచి వెళ్లిన వారి ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చెడు వ్యసనాలకు బానిసలైన అదే గ్రామానికి చెందిన శివకుమార్, కృష్ణమూర్తి చోరీలకు పాల్పడినట్టు గుర్తించామని ఎస్ఐ శ్రీనివాసరావు సోమవారం విలేకరులకు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.15 వేల నగదు, 10 తులాల వెండి, మూడు తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశామని చెప్పారు.

అంధకారం తొలగింది.. ఆనందం నిండింది

మారుమూల గిరి శిఖర గ్రామాల్లో విద్యుత్ వెలుగులు

జీలుగులోవ, పశువులబంద గిరిజనుల హర్షం


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గిరిజన గ్రామాల్లో అంధకారం

రావికమతం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరి శిఖర గ్రామాల్లో అంధకారం తొలగిపోయింది. మూడు నెలలుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో చీకటిలో మగ్గిపోతున్న గిరిజనంలో 'వెలుగు' కనిపించింది. వారిలో ఒక్కసారిగా ఆనందం నిండిపోయింది. దీంతో ధింసా నృత్యాలు ప్రదర్శించి సంబరాలు చేసుకున్నారు.

మండలంలోని జీలుగులోవ, పశువులబంద గ్రామాల్లో మూడు నెలల క్రితం విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. అప్పటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో గిరిజనులు అంధకారంలో మగ్గిపోతున్నారు. ఈ సమస్యపై గత నెల 31వ తేదీన 'గిరిజన గ్రామాల్లో అంధకారం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ కథనంపై విద్యుత్ శాఖ అధికారులు కదిలారు. ఏపీ ఏపీడీసీఎల్ రావికమతం ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా గ్రామాలను ఆదివారం సందర్శించారు. నేల కూలిపోయిన విద్యుత్ స్తంభాలను పరిశీలించి, వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. అలాగే వైర్లను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో రెండు గ్రామాల్లో ఆదివారం రాత్రి విద్యుత్ దీపాలు వెలిగాయి. మూడు నెలలు తర్వాత ఒక్కసారిగా వెలుగులు చూసేసరికి గిరిజనులు ఆనందంలో మునిగిపోయారు. ఈ క్రమంలో వారంతా ధింసా నృత్యాలు ప్రదర్శించి సంబరాలు చేసుకున్నారు. అలాగే ఈ సమస్యను వెలుగులోకి తీసుకు వచ్చి పరిష్కారానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


విద్యుత్ దీపాలు వెలగడంతో ఆనందంలో గిరిజనులు... (ఇన్‌సెట్‌లో) విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపడుతున్న సిబ్బంది

మోదకొండమ్మ జాతరకు సర్వం సిద్ధం


మోదకొండమ్మ

మాడుగుల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ జాతరకు సర్వం సిద్ధం చేశారు. గ్రామ నలుమూలల విద్యుత్ దీపాలంకరణ చేశారు. మంగళవారం ఉదయం వేకువజాము ఆరు గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు అనంతరం భక్తులు ఇళ్లవద్ద పూజించిన ఘటాలతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లిస్తారు. మండుటెండలను దృష్టిలో ఉంచుకొని ఆలయానికి వచ్చే భక్తులకు వడదెబ్బ తగలకుండా ఆలయం ముందు భాగంలో పందా టెంట్‌లు ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు అవసరమయ్యే సాధారణ, ప్రత్యేక దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పలరాజు మాట్లాడుతూ ఈ ఏడాడి గతంలో కంటే భారీగా భక్తులు తరలి వస్తారని చెప్పారు. ఈ ఏడాది జాతరకు ప్రత్యేక ఆకర్షణగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ప్రశాంతంగా పండుగ నిర్వహణకు చర్యలు

అమ్మవారి జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొన్నామని ఎస్ఐ జి.నారాయణరావు తెలిపారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 200 పోలీస్ బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఘాట్ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలు వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మళ్లించడం జరుగుతుందని తెలిపారు. ఎం.కోడూరు మీదుగా మాడుగుల వచ్చే వాహనాలను ఆలయం వెనక భాగానికి మళ్లించడం జరుగుతందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వాహనదారులు, ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్ఐ కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అల్లూరి పార్కులో వెయ్యి మందితో యోగా


అల్లూరి పార్కులో యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

కృష్ణాదేవిపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో సుమారు వెయ్యి మందితో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా అల్లూరి, గంటందొరల సమాధులను, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాలర్పించారు. అనంతరం జరిగిన యోగా కార్యక్రమంలో అందరితో కలిసి కలెక్టర్ ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాపై దృష్టిపెట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాలుగు మెగా ఈవెంట్లు నిర్వహిస్తున్నదని, ఇందులో భాగంగా కృష్ణాదేవిపేటలో యోగా సాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. యోగా సమగ్ర జీవన విధానమన్నారు. ఇది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగాన్ని మెరుగుపరిచే శక్తివంతమైన సాధనమని కలెక్టర్ వివరించారు. జిల్లాలో మాస్టర్ ట్రైనర్లకు యోగాపై శిక్షణ ఇచ్చామని, వారు గ్రామాల్లో ప్రజలకు యోగా శిక్షణ ఇస్తారని తెలిపారు. శారీకక ఇబ్బందులు ఉన్న వారు సాధన చేయడానికి అనుగుణంగా యోగాసనాలు రూపొందించినట్టు చెప్పారు. యోగాతో మధుమేహం వంటి వ్యాధులను నియంత్రణలో ఉంచుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ, జిల్లా పర్యాటక శాఖాధికారిణి మనోరమ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, డిప్యూటీ డీఎంహెచ్ఎం జ్యోతి, రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ వై.తారకేశ్వరరావు, సర్పంచ్ లోచల సుజాత, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అల్లూరి సమాధులపై పూలమాల వేస్తున్న జిల్లా కలెక్టర్

నేడు ఎరకాలమ్మ పండుగ



దేవరాపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రైవాడ ఎరకాలమ్మ గ్రామ దేవత పెద్ద పండుగను మంగళవారం నిర్వహించనున్నారు. నెల రోజుల నుంచి ప్రతి రోజూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పండుగను వైభవంగా నిర్వహించడానికి గ్రామస్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

నర్సీపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయనందుకు నిరసనగా బుధవారం నిర్వహిసున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ పిలుపునిచ్చారు. సోమవారం బైక్ ర్యాలీ, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి సీఐ గోవిందరావుతో మాట్లాడారు. అల్లంపల్లి ఈశ్వరావుపై దాడి కేసు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరారు. సీసీ పుటేజీలు పరిశీలించి దోషులను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న బత్తుల


కప్ప స్తంభం వద్ద తాతయ్యబాబు దంపతులు

బుచ్చెయ్యపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని అప్పన్నస్వామిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని అలింగనం చేసుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అధికారులు బత్తుల దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

వైభవంగా కోటమ్మతల్లి ఉయ్యాలరాట్ల జాతర

ఆకట్టుకున్న వేషధారణలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పూజలు అందుకున్న కోటమ్మతల్లి... అమ్మవారి జాతరలో కేరళ డ్రమ్స్ ప్రదర్శన

నాతవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కోటమ్మతల్లి ఉయ్యాలరాట్ల ఉత్సవం సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. రెండేళ్ళకోసారి జరిగే ఈ పండుగకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. జాతరలో శక్తివేషాలు, కేరళ డ్రమ్స్, కరీంనగర్ మహిళలతో డప్పు డాన్స్, ధింసా నృత్యాలు, గరగల డాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ బీమరాజు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు అలాగే మంగళవారం జరగనున్న ముగింపు ఉత్సవానికి భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీల కోసత ఏర్పాట్లు చేస్తున్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

▸▸ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అర్జీల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మిలతో కలిసి అర్జీలను స్వీకరించారు. పలువురితో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ వేదిక దృష్టికి సమస్యలు తీసుకు వస్తే పరిష్కారమవుతాయని ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, ఈ తరుణంలో వారిలో ఆ నమ్మకాన్ని మరింత బలపరిచేలా ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే లక్ష్యం కావాలన్నారు. పరిష్కారం కాని సమస్యల వివరాలను ఆయా అర్జీదారులకు వివరించడంతో పాటు పరిష్కారానికి అవకాశం ఉంటే ఆయా మార్గాలపై తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 265 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ముప్పై మంది విచ్చేసి వారి సమస్యలపై అర్జీలను సమర్పించారు. ప్రతి ఒక్కరితో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సమస్యల పరిష్కారానికి ఆయా స్టేషన్లలో ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అర్జీల్లో అధికంగా ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటిపై ఎక్కువగా ఉన్నట్టు కార్యాలయ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు (క్రైమ్) ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల వేదికకు 30 అర్జీలు


అర్జీలను పరిశీలిస్తున్న నర్సీపట్నం ఆర్డీవో రమణ

నర్సీపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 30 అర్జీలు వచ్చాయి. వీటిని ఆర్డీవో వీవీ.రమణ స్వీకరించారు. గొలుగొండ మండలంలోని సర్వే నంబరు 335/8లో 15 సెంట్ల తన స్థలం ఆక్రమించారని పి.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. నక్కపల్లి మండలం కాగిత గ్రామానికి చెందిన సిహెచ్.శాంతాకుమారి తనకు సంబంధించిన డి.పట్టా భూమి ఆక్రమించాలని ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. నర్సీపట్నం మునిసిపాలిటీ రామారావుపేటకు చెందిన పి.రామలక్ష్మి తన ఇంటికి వెళ్లే ఐదు అడుగుల రోడ్డు మార్గంలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసి ఇబ్బంది పెడుతున్నారని వినతిపత్రం ఇచ్చారు. నర్సీపట్నం మునిసిపాలిటీలోని ఒకటో వార్డులో పంట కాలువ, రోడ్డును ఆక్రమించి ఇల్లు కట్టాలని ప్రయత్నం చేస్తున్నారని నమ్మగంటి కన్నారావు ఫిర్యాదు చేశారు. ఈ అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.

వర్మీ కంపోస్టు కౌంటర్‌కు విశేష స్పందన


కౌంటర్‌లో కూరగాయలు, కంపోస్టును విక్రయిస్తు దృశ్యం

రావికమతం, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన గర్నికం గ్రామ పంచాయతీ వర్మీకంపోస్టు విక్రయ కేంద్రానికి విశేష స్పందన లభిస్తున్నదని ఈవోపీఆర్‌డీ భానోజీరావు తెలిపారు. జిల్లా కేంద్రంలో వారానికి ఒక పంచాయతీ చొప్పున వర్మీకంపోస్టుతో పండించిన ఉత్పత్తుల అమ్మకం కౌంటర్ ఏర్పాటు చేయాలన్న కలక్టర్ ఆదేశాల మేరకు సోమవారం గర్నికం పంచాయతీ ఉత్పత్తులను ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ తయారైన వర్మీకంపోస్టు ప్యాకెట్లు, వాటితో పండించిన కొబ్బరి కాయలు, వంకాయలు, బొప్పాయి, పచ్చిమిరపకాయలను కౌంటర్‌లో ప్రదర్శించినట్టు చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి పర్యవేక్షణలో వాటిని రూ.3445కు విక్రయించామని ఈవోపీఆర్‌డీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.అప్పలస్వామి, డీపీఆర్‌సీ ఎఫ్‌టీసీ దేముడుబాబు, పంచాయతీ క్లాస్ మిత్రాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..


నర్సీపట్నం చేరుకున్న పాఠ్య పుస్తకాలు

నర్సీపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలను పంపిణీకి సిద్ధం చేశారు. నర్సీపట్నం మండలానికి సంబంధించి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 6371 మంది విద్యార్థులకు 36,857 పాఠ్య పుస్తకాలు వచ్చాయి. ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర పుస్తకాలను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భద్రపరిచారు.

జి.కోడూరులో పారిశుధ్య పనులు చేపట్టాలి

మాకవరపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.కోడూరు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో చాయిసుధను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని గెడ్డ పక్కన ఉన్న స్థలంలో ఓ ప్రైవేటు వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టడంతో గెడ్డలోకి పోయే మార్గంలేక మురుగు నీరంతా స్తంభిస్తున్నదని చెప్పారు. దీనివల్ల దోమలు, పాములు తదితర కీటకాలు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, దీనిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల జయరాం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు..

ఆపరేషన్ కగార్‌కు గిరిజనుల బలి

▸▸ మావోయిస్టులతో శాంతి చర్చలకు ప్రభుత్వం ముందుకు రావాలి

▸▸ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి

కొత్తూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమాయక గిరిజనులను బలితీసుకుంటుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ధ్వజమెత్తారు. అనకాపల్లిలోని రోటరీ సమావేశ మందిరంలో 'ఆపరేషన్ కగార్ లోగుట్టు' అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోని ఆదివాసీ ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టు ఏరివేత పేరుతో నడుస్తున్న ఈ ఆపరేషన్ వెనుక అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోని దండకారణ్యంలో వజ్రాలు, ఇనుము, సున్నపు రాయి, బాక్సైట్, డోలమైట్ సహా 29 రకాల ఖనిజాలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి, అక్కడ అడ్డుగా ఉన్న ప్రజలను తొలగించుకోవడానికి ఆపరేషన్ కగార్ చేపట్టినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ముందుకు వచ్చి మావోయిస్టులతో శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రతినిధి వీఎస్.కృష్ణ, ఆదివాసీ సంఘం గౌరవాధ్యక్షుడు పీఎస్.అజయ్‌కుమార్ మాట్లాడారు. సదస్సులో నాయకులు ఎం.రామునాయుడు, బి.వెంకటరమణ, రాజాన దొరబాబు, రాజబాబు, సన్యాసిరావు పాల్గొన్నారు.

వడ్డాదిలో ముగ్గుల పోటీలు రేపు

బుచ్చెయ్యపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది పంచాయతీ కేంద్రంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్టు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీలను ఆ రోజు ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తామని చెప్పారు. ఆసక్తిగల మహిళలు పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.


డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావుకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, పీవీజీ.కుమార్, మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్.రాజు



విశాఖ నగర పరిధిలోని తిరుమలనగర్ ఆర్యవైశ్య సామాజిక భవనంలో సోమవారం జరిగిన 'అక్షరం అండగా, పరిష్కామే అజెండాగా...' సభలో ప్రసంగిస్తున్న 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య



ప్రసంగిస్తున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

సమస్యలకు పరిష్కారం చూపిన ఆంధ్రజ్యోతి

ఆనందం వ్యక్తం చేసిన తిరుమలనగర్ వాసులు

ఏళ్లతరబడి తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలకు 'ఆంధ్రజ్యోతి' ద్వారా పరిష్కారం లభించిందని 87వ వార్డు పరిధి వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీలో గల తిరుమలనగర్ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం తిరుమలనగర్ ఆర్యవైశ్య సామాజిక భవన్‌లో జరిగిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' సభలో పలువురు కాలనీవాసులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

కాలుష్యం నుంచి విముక్తి లభించింది

– ఎం.పరమానందం, తిరుమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి



తిరుమలనగర్ కాలనీవాసులను దశాబ్దాలుగా వేధించిన కాలుష్యం సమస్యకు పరిష్కారం లభించింది. గాజువాక ఇండస్ట్రియల్ ఎస్టేట్ డంపింగ్ యార్డు తిరుమలనగర్‌ను ఆనుకుని ఉండడం వల్ల తీవ్ర దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు పడేవారు. డంపింగ్ యార్డుకు నిప్పు పెట్టినప్పుడల్లా వెలువడే పొగ, దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అయ్యేవాళ్లం. ఈ ఏడాది జనవరి 28న తిరుమలనగర్ ఆర్యవైశ్య సామాజిక భవనంలో నిర్వహించిన 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' పేరిట 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్యక్రమంలో డంపింగ్ యార్డు వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు స్పందించి డంపింగ్ యార్డును తొలగించడమే కాకుండా ఆ స్థలం చుట్టూ చుట్టూ గోడ కట్టడం ఎంతో ఆనందంగా ఉంది.

బస్సు సౌకర్యం కల్పించడం హర్షణీయం

– జి.విశ్వేశ్వరరావు, తిరుమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు



తిరుమలనగర్ కాలనీకి సోమవారం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం లభించడం హర్షణీయం. గతంలో స్టీల్ సిటీ డిపో నుంచి తిరుమలనగర్, రాజీవ్‌నగర్ మీదుగా దువ్వాడ రైల్వే స్టేషన్‌కు, అక్కడ నుంచి తిరిగి తిరుమలనగర్, వడ్లపూడి పాత గాజువాక మీదుగా సింధియా వరకు ఆర్టీసీ ఆర్టీసీ బస్సు ఉండేది. ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉందని ఆర్టీసీ అధికారులు ఆ బస్సును రద్దు చేశారు. 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' పేరిట 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్యక్రమంలో ఈ అంశాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు స్పందించి సోమవారం నుంచి బస్సును పునః ప్రారంభించారు. తిరుమలనగర్ కాలనీ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ బస్సు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

ఆకతాయిలకు చెక్.. ఈ క్రెడిట్ 'ఆంధ్రజ్యోతి'దే..

– శ్రీలక్ష్మి, గృహిణి, తిరుమలనగర్



తిరుమలనగర్ కాలనీ మధ్యలో ఉన్న పార్కులో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉండేది. ఇతర ప్రాంతాల నుంచి ఆకతాయిలు ఇక్కడకు వచ్చి స్థానిక మహిళలు, యువతులపై అసభ్యకరంగా ప్రవర్తించడం, పరిసరాల్లోని ఇళ్లలోకి రాళ్లు రువ్వడం చేసేవారు. 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' పేరిట 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్యక్రమంలో తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాం. వారు పెట్రోలింగ్‌ను పెంచడంతో పాటు పలువురు ఆకతాయిలను పట్టుకుని వికృత చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాక తరచూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నందున ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట పడింది. ఈ క్రెడిట్ అంతా 'ఆంధ్రజ్యోతి'దే.

పైపు లైన్లను సరిచేశారు.. రోడ్లు వేశారు

– సన్యాసిరావు, తిరుమలనగర్




తిరుమలనగర్ కాలనీకి కొళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేసే పైపు లైన్లకు ఎక్కడికక్కడ లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పారుతూ కాలువల్లో కలిసేది. కాలనీవాసులకు తగినంత తాగునీరు లభించేది కాదు. నీరు లీకైన చోట్ల రోడ్లు గుంతలమయంగా మారేది. 'అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో ఈ సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారు స్పందించి పైపు లైన్లను మార్చడంతో పాటు రహదారులపై గోతులను కూడా పూడ్చారు. మరికొన్ని ప్రాంతాల్లో నూతనంగా రోడ్లు వేశారు. ఇదంతా 'ఆంధ్రజ్యోతి' చలువే.



పార్కును పరిశీలిస్తున్న 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..





కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు



వేమూరి ఆదిత్య, పల్లా శ్రీనివాసరావులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



తిరుమలనగర్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న వేమూరి ఆదిత్య, పల్లా శ్రీనివాసరావు



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న పల్లా శ్రీనివాసరావు, పక్కన వేమూరి ఆదిత్య



వేమూరి ఆదిత్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నివాసితులు



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యుడు



వేమూరి ఆదిత్యను శాలువాతో సత్కరిస్తున్న అర్చకుడు



వేమూరి ఆదిత్యను శాలువాతో సత్కరిస్తున్న మురళీ



తిరుమలనగర్ వాసుల వినతి మేరకు రాజీవ్ నగర్ నుంచి నగరంలోని రైల్వే స్టేషన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సు సర్వీస్‌ను ప్రారంభించిన అనంతరం అందులో ప్రయాణించి టికెట్ తీసుకుంటున్న 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య. చిత్రంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, కాలనీ వాసులు ఉన్నారు

ఎ.కొత్తపల్లి రేషన్ డిపో ఇన్‌చార్జి డీలర్‌పై కేసు

దేవరాపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ.కొత్తపల్లి రేషన్ డిపోలో రికార్డుల్లో కంటే నిత్యావసర సరుకులు అధికంగా ఉన్నట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఈ డిపోను సిబ్బందితో కలిసి విజిలెన్స్ ఎస్‌ఐ డి.రవి కుమార్ సోమవారం తనిఖీ చేశారు. డిపోలో నిల్వ ఉండాల్సిన దాని కంటే 764 కిలోల బియ్యం, 25 పంచదార ప్యాకెట్లు (అర కిలో ప్యాకెట్లు) అధికంగా ఉన్నట్టు గుర్తించారు. ఈ డిపోకి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కేఎం పాలెం రేషన్ డీలర్ పి.నాగమణిపై 6ఏ కేసు నమోదు చేసినట్టు పౌర సరఫరాల శాఖ డీటీ సాయిబాబా తెలిపారు. వాస్తవంగా ఈ రేషన్ డిపో డీలర్ శంకరరావుపై గతంలో 6ఏ కేసు నమోదైంది. దీంతో కేఎంపాలెం డీలర్ నాగమణికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు ఆమె కూడా అక్రమాలకు పాల్పడడంతో ఎ.కొత్తపల్లి రేషన్ డిపోను పక్కనే వున్న చిననందిపల్లి రేషన్ డీలర్ రామలక్ష్మికి అప్పగించారు. కేఎంపాలెం డిపోను దేవరాపల్లి-3 డిపో డీలర్ వెత్సా జోగిరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించామని సాయిబాబా తెలిపారు.

డబుల్ డెక్కర్ మెట్రో రైలు

విశాఖపట్నం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి కీలకమైన అడుగుపడింది. ఇంతవరకూ దీనికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారుకాలేదు. గతంలో నిర్ణయించిన ప్రకారం కాకుండా కొత్తగా ఈ ప్రభుత్వం ఆలోచన చేయడంతో దానికి తగ్గట్టు డీపీఆర్ రూపొందించాల్సి వచ్చింది. ఈ బాధ్యతను సికింద్రాబాద్‌కు చెందిన బార్సిల్ కంపెనీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖ నగర ప్రజలకు ఉన్న అనుమానాలకు ఈ నిర్ణయం ద్వారా కొంత స్పష్టత వచ్చింది. విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టులో డబుల్ డెక్కర్ రైలుతో పాటు నాలుగు వరుసల ఫ్లైఓవర్ల నిర్మాణానికి అనువుగా డీపీఆర్ తయారుచేయాలని ప్రభుత్వం బార్సిల్ సంస్థను ఆదేశించింది.

విశాఖపట్నంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. నగరంలో సుమారు 11 ఫ్లైఓవర్ల నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థ ఇంతకు ముందే డీపీఆర్ తయారుచేసి కేంద్రం నుంచి అనుమతి తీసుకుంది. అయితే నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉన్నందున ఫ్లైఓవర్లు నిర్మిస్తే అనుసంధానం చేయడం కష్టమవుతుందని, అందువల్ల రెండింటినీ సమన్వయం చేస్తూ డిజైన్ తయారుచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయం వచ్చే జూన్ నాటికి పూర్తవుతుందని భావిస్తున్న నేపథ్యంలో విశాఖ నుంచి అక్కడకు వెళ్లడానికి అనువుగా ట్రాఫిక్‌ను సరిదిద్దాల్సి ఉంది. ఇందుకు ఫ్లైఓవర్లు చాలా అవసరం. అయితే ముందు వాటిని కాకుండా బీచ్‌రోడ్డును, జాతీయ రహదారిని కనెక్ట్ చేస్తూ వీఎంఆర్‌డీఏ ద్వారా మాస్టర్ ప్లాన్ రహదారులు అభివృద్ధి చేస్తున్నారు. అవి అందుబాటులోకి వచ్చినా సరే ఫ్లైఓవర్ల అవసరం ఉందని జిల్లా నాయకులు ఇటీవల గట్టిగా కోరిన నేపథ్యంలో ప్రభుత్వం మెట్రోతో పాటే నాలుగు వరుసల ఫ్లైఓవర్లు నిర్మాణానికి డిజైన్ రూపొందించాల్సిందిగా కోరడం గమనార్హం. అయితే సిటీ మధ్యలో స్తంభాలు వేసి మెట్రో రైలు నడపడం వరకు బాగానే ఉంటుంది కానీ అదే స్తంభాలపై నాలుగు వరుసల ఫ్లైఓవర్లు నిర్మించాలంటే ఎక్కువ స్థలం అవసరమవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ డీపీఆర్‌కు ప్రభుత్వం రూ.47.17 లక్షల బడ్జెట్ కేటాయించింది.

మెట్రో రైలు మొదటి దశలో మూడు కారిడార్లకు కలిపి మొత్తం 46.23 కి.మీ. పొడవున ట్రాక్ వేయాలని ఇంతకుముందు ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ నిర్ణయించింది. మలి దశలో కొమ్మాది నుంచి భోగాపురం విమానాశ్రయం వరకూ నాలుగో కారిడార్ నిర్మిస్తారు. తొలి దశ పనులకు రూ.11,498 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 99.8 ఎకరాలు అవసరం కాగా భూసేకరణకు సుమారు రూ.882 కోట్లు నిధులు కావాలని అంచనా వేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

అక్షరం అండగా...ముందడుగు

... 1వ పేజీ తరువాయి

సమస్యలను 'ఆంధ్రజ్యోతి' చొరవతో సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించారన్నారు. మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తానని పల్లా హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను గుర్తించి అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావడమే కాకుండా...అవి పరిష్కారమయ్యే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య సామాజిక స్పృహ అభినందనీయమన్నారు. స్థానికులు అనధికార డంపింగ్ యార్డు వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమంలో చెప్పగా, 'ఆంధ్రజ్యోతి' అనేక కోణాల్లో కథనాలు ప్రచురించిందని, దాంతో ఏపీపీసీబీ ఐలా కమిషనర్ స్పందించారన్నారు. యార్డులో చెత్తను వేరొకచోటకు తరలించి, ప్రహరీ గోడ నిర్మించారన్నారు. దీర్ఘకాల సమస్య పరిష్కారమవ్వడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన కథనాన్ని సభకు హాజరైన వారికి పల్లా శ్రీనివాసరావు చూపించారు. అలాగే తిరుమల నగర్‌కు బస్సు కావాలని ఎప్పటినుంచో అడుగుతున్నాసరే 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమం ద్వారా పరిష్కారమైనందుకు సంతోషంగా ఉందన్నారు. సమాజంలో ఏ సమస్య పరిష్కారం కావాలన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని, 'ఆంధ్రజ్యోతి' ప్రారంభించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమంతో అది సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. సమాజం పట్ల వేమూరి ఆదిత్యకు ఉన్న అవగాహన తనను ఆకట్టుకుందన్నారు. సమాజంలోని దురాచారాలను వెలికితీసి, చైతన్యపరిచే కృషిని కొనసాగించడం ద్వారా మరింత ఎత్తుకు ఎదగాలని అభిలషించారు. సమాజాన్ని గాడిలో పెట్టాలంటే అధికారులు, ప్రజా ప్రతినిధులను నిలదీయడంతోపాటు చైతన్యపరచడం, జాగ్రత్తపరచడం అవసరమన్నారు. ఆ బాధ్యతను ప్రజలకు గుర్తుచేయడమే కాకుండా వారికి అండగా నిలిచే బాధ్యత తీసుకున్న 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, డైరెక్టర్ వేమూరి ఆదిత్యతోపాటు 'ఆంధ్రజ్యోతి' బృందాన్ని అభినందిస్తున్నానన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అదుర్స్

... 1వ పేజీ తరువాయి

బి.విక్రమ రాజా 216 (ఓబీసీలో 30), ఎ.సాత్విక్ 278వ ర్యాంకు, పి.ఆదిశిష్ట సుబ్రహ్మణ్యం 279వ ర్యాంకు, జె.యోగేశ్వర్ 284 (ఓబీసీలో 40), వీవీ సూర్య వినయ్ 334, పొట్నూరు కార్తీక్ 419వ ర్యాంకు, డి.సాయిధర్మ ప్రతాప్ 432వ ర్యాంకు, కేవీ అరవింద్‌కుమార్ 442వ ర్యాంకు, ఎస్.నిర్మిత్ 447, బి.మహంతో 461వ ర్యాంకు, ఆర్.కార్తీక్ 526, కె.చరణ్‌రాజు 547, బి.మహిత్ 551, టి.గౌతమ్ విజయకాశ్యప్ 557, డి.బలరాంనాయుడు 633వ ర్యాంకు, బి.రోహిత్‌దత్తా 657వ ర్యాంకు, ఎం.పవన్ కుమార్‌నాయుడు 750వ ర్యాంకు, ఎస్.హరిచరణ్ 799వ ర్యాంకు, ఎల్.చరణ్‌సాయి 963వ ర్యాంకు సాధించారు. ఇంకా ఓబీసీ కేటగిరీలో కె.నవదీప్‌రాజుకు 31వ ర్యాంకు, తారక్‌రామ్‌కు 151వ ర్యాంకు వచ్చాయి. శ్రీచైతన్య, నారాయణ ఐఐటీ అకాడమీ, అసెంట్, శ్రీవిశ్వ విద్యాసంస్థల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు.